కథ

"త్వరలో నీకో భయంకరమైన మనస్తత్వం గల వ్యక్తి పరిచయం అవుతాడు. అతని పరిచయం నీ జీవితంలో కల్లోల్లాల్ని సృష్టిస్తుంది."

స్నేహితురాలు సింధు చెప్పిన మాటల్ని విని ఆందోళనగా ఆమెవైపు చూసింది మాధురి.

"నిన్ను ఆందోళనకు గురిచెయ్యడం నా ఉద్దేశ్యం కాదు. కాస్త జాగ్రత్తగా ఉంటావని చెప్పాను. నేనన్నది నిజంగా జరగవచ్చు. జరగకపోనూ వచ్చు. బట్ బీ కేర్‌ఫుల్"

పెళ్ళయిన చాలా రోజుల తర్వాత పుట్టింటికి వచ్చిన మాధురికి మార్కెట్‌లో కనిపించింది చిన్ననాటి స్నేహితురాలు సింధు. మాధురి ఆమెను పిలుచుకుని వచ్చింది. తను చెయ్యి చూసి భవిష్యత్తులో జరిగే సంఘటనలను చెప్పగలనని, ఆ విద్య తను ఈ మధ్యే నేర్చుకున్నానని సింధు చెబితే మాధురి ఆసక్తిగా తన చేయి చూపించుకుంది. సింధు చెప్పింది విన్నాక 'తను చేయి చూపించకుండా ఉండి ఉంటే బాగుండేది. అనవసరంగా లేని భయాల్ని, ఆందోళనల్ని తెచ్చుకున్నాను' అనుకుంది మాధురి.

# కొత్త పరిచయం

## సి.ఎస్. చంద్రశేఖర్

"మీ ఆయన చాలా బాగున్నారు" మాధురి పెళ్ళి ఆల్బమ్ చూస్తూ అంది సింధు.

"నువ్వూ ప్రేమలో పడ్డావని విన్నాను. అతని ఫోటో ఉందా నీ దగ్గర"

"మనసులోనే కాదు. పర్సులో కూడా ఉన్నాడు" అని నవ్వుతూ ఫోటో మాధురికి అందించింది సింధు.

"బాగున్నాడు" ఫోటో చూస్తూ అంది మాధురి.

"మీ ఆయనంత కాదులే. కానీ చాలా మంచివాడు"

"మా ఆయన కూడా మంచివాడే"

"కాదని నేనన్నానా తల్లీ. నా ప్రియుడి గురించి చెప్పాను. అంతే. బాంచను నీ కాల్మొక్తా" స్నేహితురాళ్ళిద్దరూ నవ్వుకున్నారు.

***

వైజాగ్‌లో ఆ హోటల్ కాంపౌండ్‌లో ఉన్న గార్డెన్ ఎదురుగా వీల్‌ఛైర్‌లో కూర్చుని ఉన్న మాధురిని సమీపించిన ఆ యువకుడు 'కెన్ ఐ హెల్ప్‌యు" అని అడిగాడు.

"నో థాంక్స్. మావారు రూమ్ బుక్ చేయడం కోసం రిసెప్షన్ కౌంటర్‌కు వెళ్ళారు. టాక్సీ అతను వెళ్ళాలని తొందర చేస్తే నన్ను యిక్కడ ఉంచి వెళ్ళారు. థాంక్స్ ఎనీవే ఫర్ యువర్ కన్సర్న్" అంది మాధురి.

"పర్వాలేదు. నా పేరు సాగర్. టీవీ సీరియల్స్ రాస్తుంటాను. హ్యాపీ టైమ్ అట్ వైజాగ్. బై"

అతను వెళ్తున్న వైపే చూస్తూండి పోయింది మాధురి.

'నవ్వు ముఖంతో ఎంత చలాకీగా ఉన్నాడు ఇతను. ఇటువంటి వ్యక్తులు తాము సంతోషంగా ఉండటమే కాదు, తమ చుట్టూ ఉన్న వాళ్ళను కూడా సంతోషంగా ఉంచుతారు' అనుకుంది.

***

" 'భర్తంటే భార్యను భరించేవాడు' అని విన్నాను. దాని అర్థమేంటో యిప్పుడు తెలిసింది నాకు" మాధురిని వీల్‌ఛైర్ మీది నుంచి మంచంపై కూర్చోబెడుతూ అన్నాడు సురేష్.

"భార్యంటే మజాకా మరి?" అంది మాధురి నవ్వుతూ.

తర్వాత సురేష్ డ్రెస్సింగ్ టేబుల్ ముందు కూర్చుని టై కట్టుకుంటూంటే అతన్నే తదేకంగా చూడసాగింది మాధురి.

"ఎంత అందంగా ఉన్నాడు సురేష్? అందంలో అతనికే మాత్రం సాటి కాదు తను. అయినా తనను ప్రేమించి పెళ్ళిచేసుకున్నాడు. తన కోసం తల్లి తండ్రుల్ని, లక్షలాది రూపాయల ఆస్తిని దూరం చేసుకున్నాడు" అనుకుంది మనసులో.

"ఏయ్. ఏమిటలా చూస్తున్నావు?" సురేష్ అడిగాడు ఆమెని.

"నా భర్తను నేను చూస్తున్నాను. నీకేమిటి బాధ?"

"అందరూ నన్ను సన్నబడిపోతున్నావని అంటే ఎందుకో అనుకున్నాను. కారణం తెలిసింది యిప్పుడు"

ఏమిటన్నట్టు చూసింది మాధురి.

"నువ్వు చూపుల్తోనే నన్ను తినేస్తున్నావు కాబట్టి"

ఫక్కున నవ్వింది మాధురి. తర్వాత "సురేష్. ఇంట్లో వీల్‌ఛైర్‌లో కూర్చుని కూర్చుని విసుగు పుట్టి నీతో వైజాగ్ వస్తానని మొండికేశాను. వచ్చి నీకు ఇబ్బంది కలిగిస్తున్నానేమోనని ఇప్పుడనిపిస్తోంది" అంది.

"నా బాధంతా నీకు ఇబ్బంది కలుగుతుందనే. క్రొత్త ప్రదేశంలో ఒంటరిగా ఉంటే నీకు మరింత బోర్ కొడుతుంది కదా అని ఆలోచించాను. మా సేల్స్ మీటింగ్ ఎన్ని గంటలకు ముగుస్తుందో తెలియదు. ఎటూ మనం వచ్చేశాం కాబట్టి ఇక హాయిగా ఉండు. నీకు ప్రొద్దుపోవడం కోసం టీవీ ఉంది. నాతో మాట్లాడానికి సెల్ ఉంది. ఈ రోజు గడిపేశావంటే రేపు ఉదయం నుంచి రాత్రి మనం ట్రైను ఎక్కేవరకూ మన పెళ్ళి రోజు సెలబ్రేషన్స్-శోభనం రాత్రి రిపిటీషన్స్"

"యూ సిల్లీ" అంటూ సిగ్గుపడింది మాధురి

***

కిటికీలోంచి బయటకు చూస్తున్న మాధురికి చుట్టూ ఉన్న అందాలు అద్భుతంగా కనిపించాయి. హోటల్ బిల్డింగ్‌కు ఆనుకుని చక్కటి పార్కు, దూరంగా బంగాళాఖాతం ఆమె మనసును అలరించాయి.

వెంటనే వీల్‌ఛైర్ జరుపుకుంటూ మంచం దగ్గరికి వెళ్ళి సూట్‌కేస్‌లో ఉన్న హ్యాండీకేమ్‌ను తీసింది.

మరుసటి రోజు తమ పెళ్ళిరోజు కాబట్టి ఆ రోజు సురేష్‌కు ఆ కెమెరా బహూకరించాలని కొన్నది మాధురి. 'ఈ సర్‌ప్రైజు గిఫ్టు సురేష్‌ని తప్పకుండా ఆనందపరుస్తుంది' అనుకుంది.

కెమెరాతో పాటు యిచ్చిన బుక్‌లెట్‌లో ఉన్న సూచనలు చదివి కెమెరా ఆన్‌చేసి కిటికీలోంచి కనబడుతున్న దృశ్యాల్ని షూట్ చెయ్యసాగింది.

అయిదు నిమిషాల తర్వాత కాలింగ్ బెల్ శబ్దం విని తలుపు తీసింది. ఎదురుగా ఓ వ్యక్తి నిలబడి ఉన్నాడు. అతని వెనుక యిద్దరు రూమ్‌బాయ్స్ నిలబడి ఉన్నారు. అతను హోటల్ మేనేజర్ కాబోలు అనుకుంది.

''సారీ మేడమ్. చిన్న పొరబాటు జరిగింది. ఈ గది ఓ మున్సిపల్ అధికారి కోసం రిజర్వ్ చెయ్యబడింది. ఆ విషయం మరచిపోయి రిసెప్షనిష్టు మీకు యీ గది ఎలాట్ చేశాడు. మీరేమీ అనుకోకుంటే ఎదురుగా ఉన్న గది మీకిస్తాను. లగేజ్ మావాళ్ళే షిఫ్ట్ చేస్తారు.'' అన్నాడతను.

నమ్రతతో కూడిన అతని అభ్యర్థనను తిరస్కరించాలని ఆమెకు అనిపించలేదు.

''ఒక్క నిమిషం. మావారితో మాట్లాడి చెబుతాను'' అంటూ సెల్ చేతిలోకి తీసుకుని సురేష్ నెంబరు డయల్ చేసింది. సెల్ స్విఛ్ ఆఫ్ చేయబడిందని సమాధానం రావడంతో ''హి యీజ్ ఇన్ ఎ మీటింగ్. యు క్యారీ ఆన్'' అంది అతనితో.

ఓ బాయ్ లగేజ్ షిఫ్ట్ చేస్తే మరోబాయ్ వీల్‌ఛైర్‌ను తోసుకుంటూ ఆమెను ఎదురుగా ఉన్న గదిలోకి చేర్చాడు.

తలుపు గడియ వేసి హ్యాండీక్యామ్ చేతిలోకి తీసుకుని కిటికీ దగ్గరకు వచ్చింది. అక్కడ కనిపిస్తున్న దృశ్యాలు ఆమెకు ఆనందాన్ని కలిగించలేదు. బిజీగా ఉన్న రోడ్డు, వాహనాల హారన్లు, మనుషుల పరుగులాంటి నడకలు ఆమెకు చిరాకును కలిగించాయి.

ఇంతలో ఆమె దృష్టి ఎదురుగా కనిపిస్తున్న బిల్డింగ్ బాల్కనీలో నిలబడి ఉన్న ఆ అమ్మాయిపై పడింది.

'అబ్బ. సినిమా హీరోయిన్‌లా ఎంత అందంగా ఉంది యీ అమ్మాయి?' అనుకుంటూ కెమెరా ఆన్ చేసి ఆ అమ్మాయి వైపు జూమ్ చేసింది. ఆ అమ్మాయి ముఖం యిప్పుడు మరింత స్పష్టంగా కనిపించసాగింది. ఇంతలో ఆ అమ్మాయి వెనుక నుంచి ఓ వ్యక్తి రావడం కనిపించింది. అతను ఆమె కంటే పొడవు కానందువల్ల, ఆ అమ్మాయి అడ్డంగా ఉన్నందువల్ల అతని ముఖం కనిపించలేదు. ఫుల్‌షర్ట్ వేసుకున్న అతని చేతులు మాత్రం కనిపిస్తున్నాయి.

''అతను ఎవరు? ఆమె ప్రియుడా? ఆమె వెనుక నిలబడి కళ్ళు మూసి 'ఎవరొచ్చారో చెప్పుకో' అంటాడా? అబ్బ. ఎంత చక్కని దృశ్యం అది? ప్రేమ సర్వజన రంజకమంటారు. అందుకేనేమో'' అనుకుంటూ ఆసక్తిగా చూడసాగింది.

ఒక్కక్షణం అతను మాధురికి కనిపించలేదు. మరుక్షణం ఆ అమ్మాయి మేడపై నుంచి తలక్రిందులుగా నేలపైకి జారిపోసాగాంది.

మాధురికి ఊపిరి ఆగిపోయినట్లయింది. అతి కష్టం మీద లేచి నిలబడి క్రిందకు చూసింది. ఆ అమ్మాయి రక్తపు మడుగులో పడి ఉంది. జనం ఆమె చుట్టూ ప్రోగవసాగారు.

మాధురి తలెత్తి ఎదురుగా చూసింది. బాల్కనీలో అతను నిలబడి క్రిందకు చూస్తున్నాడు. వెంటనే కెమెరాలోంచి అతన్ని చూసి ఉలిక్కిపడింది.

అతను... అతను హోటల్ గార్డెన్‌లో రచయితగా పరిచయం చేసుకున్న వ్యక్తి. అంతేకాదు. ఉదయం ఇతన్ని ఎక్కడో చూసినట్లుంది అనుకుంది. కెమెరాలోంచి చూస్తే అతన్ని ఎక్కడ చూసిందో గుర్తొచ్చింది.

అతను.. సింధు చూపిన ఫోటోలోని వ్యక్తి. సింధు.. ప్రియుడు.

అతను తలెత్తి మాధురి వైపు చూశాడు. తర్వాత వెనక్కి తిరిగి పరుగెత్తసాగాడు.

***

అంత అందమైన అమ్మాయి ఓ కిరాతకుడి చేతిలో బలికావడం ఆమె మనస్సును కలచివేసింది. కెమెరా సూట్‌కేస్‌లో పెట్టి శిలలా వీల్‌ఛైర్‌లో కూర్చుండిపోయింది.

'సురేష్‌కు తమ పెళ్ళిరోజు గిఫ్ట్‌గా హ్యాండీకామ్ యివ్వాలని అమెరికాలో ఉన్న తన స్నేహితురాలి ద్వారా తెప్పించుకుంది. అయితే ఆ కెమెరాను మొదటిసారిగా ఉపయోగిస్తూంటే దురదృష్టవశాత్తు ఓ హత్యా దృశ్యం చిత్రీకరింపబడింది. ''నో... ఈ కెమెరాను సురేష్‌కు గిఫ్ట్‌గా ఇవ్వకూడదు. దీన్ని ఎవరికైనా అమ్మేసి ఇంకో కెమెరా కొనాలి' అనుకుంది.

అరగంట తర్వాత టీవీ ఆన్ చేసి న్యూస్ ఛానల్ పెట్టింది. ఆ అమ్మాయి హత్య గురించిన వార్త ప్రసారం చేస్తున్నారు. ఆమె హైదరాబాదు వాసి అని, టీవీల్లో నటిస్తుందని, పేరు అపర్ణ అని, సీరియల్ షూటింగ్ కోసం వైజాగ్ వచ్చిందని, హోటల్ బాల్కనీలో నిలబడి ఉంటే ఎవరో వ్యక్తి క్రిందకు తోసేశాడనీ, ఈ సందర్భంగా హోటల్ మెట్లపై నుంచి పరుగెడుతున్న ఓ వ్యక్తిని జనం పట్టుకున్నారని, పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుని ఇంటరాగేట్ చేస్తున్నారని టీవీలో చెప్పారు.

అతని ఫోటో టీవీ స్క్రీన్‌పై చూడగానే 'వాడే... వాడే ఆ దుర్మార్గుడు. చంపెయ్యాలి అలాంటి చీడపుగుల్ని' అనుకుంది కసిగా. 'ఉదయం ఆ రాక్షసుణ్ణి చూసి అతను తన చుట్టూ ఉన్నవాళ్ళను ఆనందంగా ఉంచుతాడని అనుకుంది. అందుకే పైపై మెరుగుల్ని చూసి మోసపోకూడదు' అనుకుంది. వెంటనే ఆమెకు సింధు గుర్తుకొచ్చింది.

'సింధు వద్ద సెల్ లేదు. త్వరలో కొంటానని, కొన్నాక నెంబరు ఇస్తానని చెప్పింది క్రితంసారి కలసినప్పుడు. ఇప్పుడు తను ఆమెను ఎలా కాంటాక్ట్ చేయాలి? ఆమె ప్రియుడి అసలు రూపం గురించి ఎలా చెప్పాలి? ఆమెను అతని బారి నుంచి ఎలా కాపాడాలి' అను కుంటూ మధనపడసాగింది. మళ్ళీ 'సింధు టీవీ వార్తల ద్వారా అతని గురించి తెలుసుకుంటుంది. లేదా రేపు పేపర్లో అతని ఫోటో చూసి తెలుసుకుంటుంది. అతనితో సాన్నిహిత్యం తెంపు కుంటుంది' అనుకుంది.

తను చూసిన దృశ్యాన్ని భర్తకు చెప్పాలని అతని సెల్‌కు చాలా సార్లు ప్రయత్నించింది. అయితే అతని సెల్ స్విఛాఫ్ చేయబడిందని సమాధానం రావడంతో నిరుత్సాహపడింది. మధ్యాహ్నం రెండు గంటలకు సురేష్ దొరికాడు ఫోనులో.

''ఎక్కడున్నావు సురేష్?'' అని అడిగింది.

''హోటల్‌లో లంచ్ చేస్తున్నాను. నువ్వు భోంచేశావా?''

''లేదు''

''ఎందుకని?''

మాధురి తాను చూసిన హత్య గురించి చెప్పింది.

''అందుకని బాధపడుతూ భోంచెయ్యకుండా కూర్చున్నావా? సరే. నేనిప్పుడు బయలుదేరి వస్తున్నాను''

''నువ్వు భోజనం చేసిరా. తొందరలేదు''

''నీతోనే కలసి తింటాను. మనిద్దరికీ లంచ్ ఆర్డరివ్వు''

తమ గది మారిన విషయం అతనికి చెప్పి సెల్ ఆఫ్ చేసింది మాధురి.

***


ఆ రోజు మాధురి మనసు ఆనందంగా ఉంది.


వైజాగ్ నుండి రాగానే ఆర్థోపెడీషియన్‌ను కలిసింది మాధురి.

''యు ఆర్ హండ్రెడ్ పర్సెంట్ ఓకె. ఈ రోజు నుంచి మీకు వీల్‌ఛైర్ అవసరం లేదు. మీరు అందరిలా హాయిగా నడవవచ్చు. పరుగెత్తవచ్చు. వస్తే డ్యాన్స్ కూడా చెయ్యొచ్చు'' అన్నారాయన. ఆమాటలు ఆమెకెంతో సంతోషాన్ని, ఉత్సాహాన్ని యిచ్చాయి.

సురేష్ డ్యూటీకి బయలుదేరి వెళ్ళగానే టేప్‌లో వెస్టర్న్ మ్యూజిక్ పెట్టుకుని కాళ్ళు మెల్లగా కదుపుతూ డ్యాన్స్ చెయ్యసాగింది.

ఇంతలో కాలింగ్‌బెల్ మ్రోగితే వెళ్ళి తలుపు తెరచి ఎదురుగా ఉన్న వ్యక్తిని చూసి





నిర్ఘాంతపోయింది.

అతను... సింధు ప్రియుడు.

వెంటనే తలుపు మూయడానికి ప్రయత్నించింది. అయితే అటుప్రక్కనుంచి అతను తలుపును తోస్తూండటంతో ఆమె ప్రయత్నం ఫలించలేదు. చివరకు తన ఒంట్లోని బలమంతా చేతుల్లోకి తెచ్చుకుని తలుపును గట్టిగా తోసి గడియపెట్టింది.

తర్వాత వచ్చి కుర్చీలో కూర్చుంది. భయం వల్ల ఆమె చేతులు వణుకుతున్నాయి. శరీరంలో నిస్సత్తువ ఆవహించింది. వెంటనే ఆమెకు సింధు చెప్పిన విషయం గుర్తుకొచ్చింది.

'ఓ క్రొత్త వ్యక్తి పరిచయం నా జీవితంలో కల్లోలాలు రేపుతుందని సరిగ్గానే చెప్పావు. కాని ఆ వ్యక్తి నీ ప్రియుడేనని నీవు తెలుసుకోలేకపోయావు సింధూ' అనుకుంది.

'అయినా ఇతన్ని పోలీసులు అరెస్ట్ చేశారని టీవీలో చూపారు కదా. మరి ఎలా బయటకు వచ్చాడు? బెయిల్ మీద విడుదల చేశారా? లేక సాక్ష్యాలు లేవని వదిలేశారా?'

'సాక్ష్యాలు' అనుకోగానే ఆమెకు తను ఆ హత్యను విడియో తీసిన విషయం గుర్తుకొచ్చింది.

'ఆ తర్వాత తను ఆ కెమెరాను తాకనేలేదు. వెంటనే తను షూట్ చేసిన దృశ్యాల్ని సి.డి.లోకి లోడ్ చేసి ఆ సి.డి.ని పోలీసులకు అందజెయ్యాలి. అది అతనికి శిక్ష పడటానికి బలమైన సాక్ష్యమవుతుంది. అతను బయట ఉంటే తనకూ ప్రమాదమే' అనుకుని సూట్‌కేస్‌లోంచి కెమెరా బయటకు తీసి కంప్యూటర్ ఆన్ చేసింది. కెమెరాలో ఉన్న దృశ్యాల్ని హార్డ్‌డిస్క్‌లోకి లోడ్ చేసి తర్వాత ప్లే చేసింది.

మానిటర్ వైపు తదేకంగా చూస్తున్న ఆమె

కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి. అయిదు నిమిషాల తర్వాత భర్తకు ఫోన్ చేసి మాట్లాడసాగింది.

***

కాలింగ్ బెల్ శబ్దం విని కిటికీలోంచి భర్తను చూసి తలుపు తెరిచింది మాధురి.

''వాడు మళ్ళీ వచ్చాడా?''

రాలేదన్నట్టు తల అడ్డంగా ఊపి ఏడవసాగింది.

అతను ఆమె భుజం మీద అనునయంగా చెయ్యి వేసి ''ప్లీజ్. ఏడవకు. నేనొచ్చేశానుగా. అయినా నీవు ఆ హత్య చూసినట్లు వాడెకెలా తెలుసు? అంత దూరం నుంచి నీ ముఖం కనబడదుగా?'' అన్నాడు సురేష్.

''ఆ గదిలో ఎవరు దిగారో హోటల్ రికార్డ్స్‌లో చూసి తెలుసుకుని ఉంటాడు. అందులోని మన అడ్రస్ నోట్ చేసుకుని యిక్కడికి వచ్చి ఉంటాడు''

''ఇక్కడికి వచ్చి ఏం చేద్దామని?''

''ఆ రోజు సంఘటనని నేను విడియో తీశాను. అది నేనెక్కడ పోలీసులకు అందజేస్తానో అని భయపడి దాన్ని నా నుంచి తీసుకునేందుకు వచ్చి ఉంటాడు''

''నువ్వు వీడియో తీశావా? విడియో కెమెరా నీకెక్కడిది?'' ఆశ్చర్యంగా అడిగాడు.

మాధురి చెప్పింది.

''మరి ఆ క్యాసెట్టు నువ్వేం చేశావు?''

''నా దగ్గరే ఉంది. కాని నువ్వనుకున్నట్లు అందులో ఏదీ రికార్డు కాలేదు. అదే నాకూ ఆశ్చర్యంగా ఉంది''

''ఏదీ ఆ కెమెరా యిటివ్వు'' అంటూ ఆమె అందించిన కెమెరా రెండుసార్లు రివైండ్ చేసి చూసి ''మంచి ఛాన్సు మిస్ చేశావు. కాస్త జాగ్రత్త వహించి షూట్ చేసి ఉంటే ఓ హంతకుణ్ణి చట్టానికి పట్టిచ్చిన తృప్తి నీకు దక్కేది. నీకూ వాడి పీడ విరగడై ఉండేది'' అన్నాడు నిరుత్సాహంగా.

మాధురి బేలగా అతనివైపు చూసింది.

''నువ్వేం భయపడకు. ఈ సారి వాడు వస్తే నాకు ఫోన్ చెయ్యి. వాడి సంగతి నేను చూసుకుంటాను. వాడు దొరికే వరకూ క్యాంపులు తగ్గించుకుని సిటీలోనే ఉంటాను'' అన్నాడు సురేష్.

***

పది రోజుల తర్వాత సురేష్‌కు మాధురి దగ్గర్నుంచి కాల్ వచ్చింది.

''సురేష్. నీకో గుడ్‌న్యూస్''

''వాడు పోలీసులకు దొరికాడు?''

''సి.డి.లో దొరికాడు. వీడియో కెమెరాతో పాటు రెండు కేసెట్లు ఫ్రీగా యిచ్చారు. నేను ఒక కేసెట్ మాత్రమే యిచ్చారనుకుని దాన్ని హార్డ్‌డిస్క్‌లో లోడ్ చేయటానికి ప్రయత్నించాను. ఇప్పుడు వెతికితే బ్యాగులో యింకో క్యాసెట్ దొరికింది. అందులో హంతకుడి రూపం స్పష్టంగా రికార్డ్ చేయబడి ఉంది''

''వెరీగుడ్. నేనిప్పుడే బయలుదేరి వస్తున్నాను. ఇద్దరం కలసివెళ్ళి పోలీసులకు ఆ కేసెట్ అందజేద్దాం'' సురేష్ ఇంటికి రాగానే మాధురి కంప్యూటర్ ఆన్ చేసి ఫైలు ఓపన్ చేసింది. సురేష్ ఫైలు చూడటం పూర్తయ్యాక మాధురి వైపు చూశాడు. ఆమె అతని వైపే చూస్తోంది. సురేష్ నవ్వుతూ ''కంగ్రాట్స్ మధూ. ఇప్పుడేం చేద్దాం?'' అని అడిగాడు. ''ఇద్దరం పోలీస్ స్టేషన్‌కెళ్దాం. నువ్వు సరెండర్ అయిపో''

సురేష్ ఆమెవైపు క్రూరంగా చూశాడు.

''నువ్వు నన్ను కూడా చంపాలని ప్రయత్నించావు కదూ. ఆరోజు మేడపై నుంచి ఎలా పడిపోయానో ఎంత ఆలోచించినా గుర్తురాలేదు. ఇప్పుడు ఆలోచిస్తే గుర్తొస్తోంది. నువ్వు ప్రేమతో నా భుజం మీద వాలిపోతున్నట్లు నటిస్తూ నన్ను తోసేశావు కదూ?'' కళ్లనీళ్ళతో అడిగింది మాధురి.

''అవును. ఆ రోజు నీ అదృష్టం బాగుంది. చావు తప్పించుకుని కాలు మాత్రం విరగ్గొట్టుకున్నావు. వెంటనే నిన్ను చంపితే పోలీసులకు అనుమానం వస్తుందని అవకాశం కోసం ఓపికగా ఎదురు చూస్తూంటే వీడియో తీసి నీ చావు నీవే తెచ్చుకున్నావు. 'ఎలక్ట్రిక్ షాకు తిని మహిళ మృతి'- రేపు న్యూస్‌పేపర్‌లో రాబోయే క్యాప్షన్ యిది. ఎలా ఉంది?' బ్యాగులోంచి ఎలక్ట్రిక్ వైర్లు బయటికి తీస్తూ అన్నాడు సురేష్.

'' 'భార్య చాకచక్యం-మోసగాడైన భర్తకు కారాగారం' యీ క్యాప్షన్ యింకా బాగుంది కదూ?''

''నీకా అవకాశం రాదు బుజ్జీ'' వెటకారంగా అన్నాడు.

''వచ్చింది సురేష్. ఓసారి వెనక్కి తిరిగి చూడు.

వెనక్కి తిరిగి చూసిన సురేష్‌కు పోలీసులు కనిపించారు.

***

''ఆ రోజు మాధురిగారు కంప్యూటర్‌లో సురేష్‌ను హంతకుడిగా గుర్తించగానే మాకు ఫోన్ చేసి చెప్పారు. అయితే అతని నిజస్వరూపం తనకు తెలిసిపోయిందన్న విషయం అతనికి చెప్పవద్దని ఆమెను మేము కోరాము. సురేష్‌పై నిఘా ఉంచాము. ఈ పది రోజుల్లో అతని కార్యకలాపాలు, చేస్తున్న నేరాలు మాకు తెలిశాయి. అతన్ని అరెస్ట్ చేశాక మరిన్ని నేరాలు బయటపడ్డాయి.

అమ్మాయిల్ని ప్రేమ పేరుతో మోసగించి, వారి ధనాన్ని, మానాన్ని దోచుకున్నాక మాయమైపొయ్యే వాడు సురేష్. వెళుతూ వెళుతూ తన ఫోటోలు వారి దగ్గర లేకుండా జాగ్రత్తలు తీసుకునేవాడు. మళ్ళీ క్రొత్త ఊరిలో క్రొత్త అమ్మాయి కోసం వేట సాగించే వాడు. ఇతని గుట్టు తెలుసుకున్న యిద్దరు అమ్మాయిల్ని కడతేర్చాడు కూడా. మాధురి మాత్రం పట్టుదలతో తన ప్రేమను పెళ్ళి వరకూ తీసుకురావడంతో కొంత యిబ్బంది పడ్డాడు సురేష్. పెళ్ళయ్యాక ఆమెను వదిలించుకునే ప్రయత్నం చేశాడు కాని ఫలించలేదు. అయితే అతను వైజాగ్ వెళ్తూంటే తనూ వస్తానని మాధురి పట్టుబట్టడం, హోటల్‌లో అతను కోరుకున్న గది చివరి నిమిషంలో మారడం, అతను అపర్ణను మేడ మీది నుంచి త్రోసిన దృశ్యాన్ని మాధురి వీడియో తీయడం, ఆ వీడియోను ఆమె మాకు అందించడం వల్ల సురేష్‌ను అరెస్ట్ చేయగలిగాము. ఇందుకు మాధురిగారికి మా డిపార్ట్‌మెంట్ తరపున కృతజ్ఞతలు చెబుతున్నాను''

విలేకరుల సమావేశంలో పోలీసు కమీషనర్ ఆనందరావు మాటల్ని ఆసక్తిగా విన్నారు అందరూ. ''మీరు ఏది చూశారో అదే వీడియోలో రికార్డ్ చేశారు కదా. మరి కంప్యూటర్‌లో చూస్తేగాని మీరు హంతకుణ్ణి గుర్తించలేక పోవడం ఏమిటి?'' మాధురిని ఓ విలేకరి అడిగాడు.

''ఆ అమ్మాయి క్రింద పడుతున్నప్పుడు నేను లేచి నిలబడి తల క్రిందకు వంచి చూశాను. కాని నేను కెమెరాను రికార్డింగ్ మోడ్‌లోనే ఉంచినందువల్ల, అసంకల్పితంగా కెమెరా ఏంగిల్ మార్చనందువల్ల అపర్ణను తోసేసిన వెంటనే లేచి నిలబడిన సురేష్ నా కెమెరాకు చిక్కాడు. నేను తలెత్తి చూసేసరికి అపర్ణకు డైలాగ్స్ వివరించడానికి అక్కడికి వచ్చిన సాగర్ నాకు కనిపించడం వల్ల నేను అతన్నే హంతకుడిగా భావించాను. నేను వీడియో తీయడం సాగర్ చూశారు కనుక 'ఆ కేసెట్‌ని పోలీసులకు అందజేస్తే అసలు హంతకుడు పట్టుబడతాడని, తను నిర్దోషిగా విడుదలవుతానని' నన్ను కోరడానికి అతను మా ఇంటికి వస్తే నన్ను చంపడానికి వచ్చాడని భయపడ్డాను'' అంది మాధురి.

***

మరుసటి రోజు సాగర్‌తో పాటు ఇంటికి వచ్చిన సింధుతో ''సింధూ నువ్వు చెప్పిందే జరిగింది. ఓ దుర్మార్గుడు నాకు పరిచయమయ్యాడు. అఫ్‌కోర్స్ ప్రేమికుడుగా, భర్తగా అతను నాకు ముందే పరిచయం. కాని దుర్మార్గుడిగా మాత్రం యీ మధ్యే పరిచయం. నా జీవితంలో అతని పరిచయం కల్లోలం సృష్టించింది. ప్రేమపిచ్చిలో పడి అతనెలాంటివాడు, అతని కుటుంబం ఎలాంటిది, అతను నిజంగా ఉద్యోగం చేస్తున్నాడా అన్న విషయాలు తెలుసుకోకుండా అతను చెప్పినవన్నీ నమ్మేసి పెళ్ళి చేసుకునే నా లాంటి వాళ్ళ జీవితాల్లో కల్లోలం రాకుండా ఎలా ఉంటుంది? అయితే కరుణామయుడైన భగవంతుడు ఆ కల్లోలాన్ని తట్టుకునే శక్తి నాకిచ్చాడు. మరి కొంతమంది జీవితాల్ని కాపాడే అవకాశం కూడా యిచ్చాడు'' అంది మాధురి.

*

